# మాయ

ప్లీడరీ పట్టా పుచ్చుకువచ్చి మర్నాడు, పెద్ద ప్లీడరుగారి యెదుట వినయంగా నిల్చున్నాడు మూర్తి. అప్పుడు పెద్ద ప్లీడరుగారు మూర్తికి ఒక హెచ్చరిక చేసేరు, ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తుంచుకోమన్నారు: బాగుపడాలంటే ఆ విధంగా బతికి బాగుపడమని సలహా చెప్పేరు.

'ది ఎర్లీ బర్డు కాచెస్ దివర్మ్' అన్నాడు ఇంగ్లీషువాడు. పురుగుని పట్టేపిట్ట పొద్దున్నే లేవాలన్నాడు. ఇంగ్లీషువాడేం తక్కువవాడు కాడు. ఏది చెప్పినా బాగా లాభం ఆలోచించికానీ చెప్పడు. ఏది చేసినా లాభంకోసం తప్ప చెయ్యడు. అందుచేత రోజూ వేగిరం లేచి వేగిరం కోర్టుకివెళ్ళి, దగ్గిరుండి కోర్టు గేట్లు తీయించు. సాయంకాలం చక్కా దగ్గరుండి కోర్టుగేట్లు వేయించి మరీ ఇంటికిరా. ఉండడం మాత్రం ఎల్లప్పుడూ కోర్టునే కనిపెట్టుకునుండు. వేశ్యలు వీధిగుమ్మాలు కనిపెట్టుకునుంటారు. నక్కలు శ్మశానాన్ని పట్టుకు వేళ్ళాడుతాయి. కొంగలు రేవుని కాసుకునుంటాయి. సామ్యం బావులేదు. కాని మనం చెయ్యవలసినపనికూడా అదే. నువ్వు బాగుపడాలంటే ఎల్లప్పుడూ కోర్టునే కనిపెట్టుకునుండాలి. మధ్యాహ్నం క్రికెట్ మాచ్‌కనీ, మూడుగంటలాట సినిమా, మరోటీ మరోటీ బిజినెస్ అనీ చెక్కేర్లుకొడితే కొట్టవచ్చు. కొడితేమాత్రం బాగుపడవు. అది ఖాయం. నేననుభవంమీద చెప్తున్నాను. కోర్టంటే ఏమిటో తెలుసా? పెద్ద అడివి! హయీనాకి తెలుగుపేరు తెలుసా? దుమ్ములగొండి. అది అడివిలో, మనిషి నవ్వినట్టు అరుస్తుంది; నవ్వువిని వెళ్తే నమిలి మింగేస్తుంది. మనం కోర్టు కొచ్చిన పార్టీలని ఆకర్షించాలి. వృత్తిధర్మం అది. ఏం చేస్తాం? అడవిలోకి వచ్చినవాడిది పొరపాటు, మనదికాదు. వింటున్నావా? హయీనాలేకాదు, ఇంకా పెద్ద జంతువులున్నాయి. జాగ్రత్తగా వుండకపోతే అవి మనల్ని తినేస్తాయి. అందుచేత మనం యెల్లప్పుడూ బహుపరాగ్గా ఉండాలి. ఉండక పోతే తరచు పార్టీలే మనల్ని తినేస్తారు. అసలు లోకం అంతా అలావుంది. నువ్వూ నేనూ ఏం చెయ్యగలం? ఈ పాడులోకానికి తగినట్టుగానే న్యాయం నిలబెట్టాడు ఇంగ్లీషువాడు. ఈ కోర్టూ, ఈ 'లా' పుస్తకాలూ, ఈ ప్లీడరీ పట్టాలూ, ఈ సాక్షి పద్ధతులూ. ఇవన్నీ వాడి భిక్షేనన్న సంగతి మర్చిపోకు. మాయలేన్ది ఇవేవీ లేవని తెలుసుకో. పార్టీ ఏ కోర్టుకి వెళ్ళాలంటే ఆ కోర్టుకి వెళ్ళడానికి కావలసినన్ని కోర్టులున్నాయి. ఏ జడ్జికి ఏ

తీర్పు కావాలంటే అది తీసివ్వడానికి చచ్చినన్ని తీర్పులున్నాయి. ఏ విధంగా కావలస్తే ఆ విధంగా సాక్ష్యం పలకడానికి దేశంలో కావలసినంతమంది దొంగరాస్కెల్సున్నారు. మప్పడానికి మనం వున్నాం. సివిల్ కేసవనీ, క్రిమినల్ కేసవనీ, సాక్ష్యంతోనే సంబంధం కాని, సత్యంతో సంబంధం లేదు. న్యాయం, ధర్మం, సత్యం మాటలు పేలించు. కాని, అంతా మాయే నని తెలుసుకో. పద్ధతే అలా వున్నప్పుడు, ఇందులో మనం ఏం చేసినా సరే, పాపం మనకెలా అంటుకుంటుంది? అంటుకోడానికి వీల్లేదు. పాపాలంటూ ఏమైనా వుంటే, తీర్పులు చెప్తారు. కాబట్టి, ఆ పాపాలన్నీ, జడ్జీలవి. ఖర్చులన్నీ పార్టీలవి. లంచాలన్నీ సాక్షులవీ, గుమాస్తాలవీ. ఫీజులన్నీ మనవి. ఇంగ్లీషువాడు మనకి స్థాపించిన న్యాయం అది. ఆకులన్నీ ప్రజలవి. ఆపిల్ పళ్ళన్నీ అధికార్లవి. వాళ్ళ దేశంలోనూ అంతే. మనదేశం లోనూ అంతే. మనకి వాడు చెప్పిన పాఠమే అది. పని కూలీ వెధవల్ది. లాభం బుగతది. ఏమైనా అంటే ఎదురు తిరిగితే మన సాయానికి కోర్టులున్నాయి. జెయిళ్ళున్నాయి. ఇవి లేకపోతే ఇంగ్లీషువాడి రాజ్యమే లేదు. మాయగాళ్ళల్లోకల్లా మాయగాడు. గొప్ప మాయగాడు. మనదేశం వచ్చి, మన ఉప్పు మనకే అమ్మి 'నా ఉప్పు తిన్నావు. నాకు విశ్వాసంగా ఉండవా?' అని అడగ్గల్గినవాడు ఎంత మాయగాడో ఆలోచించుకో. కోర్టులూ, జెయిళ్ళూ మనకి చక్కగా కట్టించాడు. మంచి మంచి బంగాళాలు తనకి కట్టించుకున్నాడు. ఆఖర్నయినా ఏం చేశాడు? అక్కడా అక్కడా చలాయించినట్టు ఇక్కడ కూడా కూలి వెధవలు పెత్తనం చలాయిస్తారేమోనని అనుమానం తగిలింది. అసలుకే మోసం వస్తుందేమోనన్న భయం కలిగింది. వెంటనే సాటి షావుకార్లకి రాజ్యం అప్పజెప్పి చల్లగా తెర వెనక్కి జారుకున్నాడు. గొప్ప మాయగాడు. వ్యాపారం వ్యాపారంలాగే వుంది. లాభాలు లాభాల్లాగే వున్నాయి. ఏదైనా రొష్టుంటే అదంతా మన వెధవల్దే అయింది. గొప్ప మాయగాడు; గొప్ప 'మాయగాడు' అని ముగించేశాడు పెద్ద ప్లీడరుగారు. ఇంగ్లీషువారి గుణ గుణాల్ని వర్ణించడంలో ఆయనకి వళ్ళు తెలీదు. ఆనందపారవశ్యంతో నిమీలిత నేత్రుడై మాటాడతాడు. ఆయనే కాని ఆడదైతే ఏ ఇంగ్లీషు వాడితోనో ఒకడితో ఏనాడో లేచిపోయుండును.

మాయగాళ్ళకి ప్రపంచంలో అంతపలుకుబడుందనీ, వాళ్ళని స్తుతించేవారంతమంది పెద్దలున్నారని మూర్తికి తెలియక కొంచెం గాభరా పడ్డాడు.

అది చూసి పెద్దప్లీడరుగారు, "సినికల్‌గా మాట్లాడే ననుకోకోయ్! సత్యం చెప్పేనంతే! బురఖా తీసేసిచూస్తే అంతా అంతే! మరేం గాభరాపడకు" అన్నారు.

గురువుగారు ఓపిగ్గా అంతచెప్పినప్పటికీ మూర్తికి ఆయన ఉపదేశం వంటబట్టలేదు. అతనికి జ్ఞానోదయం కాలేదు. పెద్దలు చెప్పిన ఆ పాఠాలు అర్థం కాకపోడం చేత ఈ యేడాదిలోనూ అతనికి కళ్ళు లోతుకు పోయేయి. అడ్డుగా కొంచమైనా సాగదీస్తే కాని అసలు మనిషిలాగానే లేదు.

ఓ రోజు సాయంకాలం నాలుగ్గంటలకి అతను తల వంచుకొని, నెమ్మదిగా ఇంటివైపుకి కాళ్ళీడుస్తూ వుంటే, అతణ్ణెవరో వెనుక నుండి వచ్చి భుజంపట్టుకు ఆపేరు. ఆపగానే అతను త్రుళ్ళిపడి పడిపోబోయాడు. పడిపోకుండా పట్టుకు నిలబెట్టవలసి వచ్చింది.

ఓ గెద్దలాటి మనిషి అతన్తో గబగబా చెప్పడం ప్రారంభించేడు.

"బాబూ! ఆడమనిషుంది. అరెస్టు చేసి తెచ్చారు. ఇప్పుడిప్పుడే జెయిలుకు రిమాండయింది. తగువేం పెద్దదికాదు. చిన్న సారాతగువు. జామీను మీదా దాన్ని తీయాలి. ఇడిగో వీడూ నేనూ జామీనుదార్లం. ఇదిగో మా ఆస్తి సర్టిఫికేటు. అయిదు వివచ్చ రూపాయలు కక్కితేగాని, కాయితం మీద కలం పెట్టేడు కాదు గ్రామ్మున్సబు. ముద్దాయి మొగుడు వీడూ! మీక్కూడా ఏదో తృణం ఇచ్చుకుంటాడు. దయచేసి, మనిషిని బైటికి తియ్యాలి."

అతని పక్కనే మరో గెద్దలాటి మనిషున్నాడు. అతను మరో జామీను మనిషి. ఎడంగా కునుకుకుక్కలా ఓ నలభై యేళ్ళ మనిషి నిల్చున్నాడు. అతను ముద్దాయి పెనిమిటి.

ఆ పెనిమిట్ని 'ఇయ్యరా! బాబుగారికేదో కొంత ముందియ్యరా' అని వాళ్ళిద్దరూ కూకలు వేసేరు.

పెనిమిటి కొంచెం ముందుపట్టుమీదున్నాడు.

"మనిషిని ముందు తియ్యమను" అన్నాడతను.

"డబ్బివ్వకపోతే మనిషినెలా తీస్తాడు?"

"ఏసికాలు నా దగ్గరకాదు! ముందు మనిషిని తియ్యమను."

"డబ్బుతియ్ మనిషిని తీస్తారు."

"మనిషిని తీయమను, ఆ యెనక డబ్బు తీస్తాను."

ఇలా కొంత ఘర్షణ జరిగేక మూర్తి ఓ జామీను పిటీషను రాసి జామీను ఆర్డరు వేయించుకొని, కోర్టులో ఎవరిది వాళ్ళకి పారేయించేసి, విడుదల వారంటు జెయిలుకి పంపించి, ఫీజు డబ్బులు లెక్కబెట్టుకొంటూ ఇంటికి బయల్దేరుతూ ఉంటే, జామీనుమనిషి అతణ్ణి మళ్ళీ ఆపేడు.

"ఏం?" అన్నాడు మూర్తి.

"ఇలారండి చెప్తా" అన్నాడతను.

"ఆఁ చెప్పండి."

"యింకొంచెం యిలారండి."

"ఒచ్చేను, చెప్పండి."

"బాబూ! తమరిల్లెక్కడా?"

"ఎందుకూ"

"ఆడమనిషిని రేపు తమరి దగ్గరికి తీసుకొస్తాను."

"ఎందుకూ?"

"కేసుకూడా తమరే వాదించుదురుగాని."

"సరే!"

"ఎందకి తక్కువకి చెయ్యకండి."

"ఇవ్వగలదా?"

"పులిసుంది ఇవ్వకేం చేస్తుంది!"

"సరే!"

"ఏదేమైనాసరే, యాభై కి తక్కువకి దిక్కండి."

"సరే"

"నే చెప్పిన అంకిమీద అలా నిలబడండి. ఇచ్చేట్టు నేచూస్తాను, అదిస్తుంది, ఈ మొగుడు లంజికొడుకు కాణీ కసగడు కాని అదలాకాదు!"

"సరే రేపు రమ్మనండి."

"కష్టడీలో తీసుకొచ్చికట్టి పడీనూ? మరి, మమ్మల్ని కూడా ఓ కంట కనిపెట్టాలి తమరు."

"ఎందుకూ?"

"ఎందుకా? తమ రెరగనట్టు."

"అంటే...."

"తమరిత్తమరు తీసుకోండి. మాదిమాకు పారేయండి. ఇవాళేం ఇవ్వకండి. తమరికే తక్కువ. రేపటిమాటే చెప్తున్నా" అని వెళ్ళిపోతూ "మరో మాటా, బాబూ! రేపది 'బీద్దాన్ని బాబూ' అంటుంది. నే కూడా 'అవును బాబూ! చాలా బీద్ది' అంటాను. మీరు మాత్రం మీ అంకె దిగొద్దు" అనేసి వెళ్ళిపోయాడతను.

మర్నాడు ఉదయం ఎనిమిది గంటల సమయంలో, వీధి నడవలో కుర్చీమీద కూర్చున్నాడు మూర్తి. కూర్చొని సగం సిగరెట్టు కాల్చేడు. అంతలో 'ఇదిగో! ఇక్కడిక్కడ!' అంటూ జామీను మనిషి వచ్చేడు. అతని వెనక ఓ ఆడ మనిషి వచ్చింది.

"ఇదిగో బాబూ! నిన్నటి మనిషి" అన్నాడు జామీను మనిషి.

ఆమెకి ముప్పయ్యేండ్లుండొచ్చు. ఒకప్పుడామె అందంగా ఉండుంటుంది. పెద్ద కొప్పుని ఒకప్పుడు చక్కగా ముడుచుకుని ఉండుంటుంది. ఆమె కట్టుకున్న నల్లకోక ఒకప్పుడు, అప్పుడెప్పుడో కొత్తదయుంటుంది. చాలారోజుల క్రిందట చాలాసార్లు భోంచేసి ఆమె ఆరోగ్యంగా ఉండుంటుంది. ఆవిడ మూర్తిని పరీక్షగా చూస్తూ నేలమీద, జామీను మనిషికి కొంచెం ఎడంగా కూర్చొంది.

"ఏం పేరూ? మర్చిపోయాను" అన్నాడు మూర్తి.

"ముత్తేలమ్మ. కోర్టుకి శానాసుట్లొచ్చాను" అందామె. అంటూ వెంటనే తిన్నగా వ్యవహారం ఫైసలు చెయ్యడంలోకి దిగింది.

"శానాసుట్లు కోర్టుకొచ్చి పెద్ద పెద్ద ప్లీడర్లనే యెట్టి ఆళ్ళకి దోసిళ్ళతో ఫీజులిచ్చేను. కానా రోజులు ఎళ్ళిపోయినాయి. ఇప్పుడిదివరకటి ముత్తేలమ్మని కాను. శానా సితికి పోయినాను. యాపారం దెబ్బతినేసింది. ఓ కొట్టుకి పదికొట్లు లెగిసిపోనాయి. జెవానుబాబులే అమ్మించేస్తున్నారు. నాను బూముట్టమైపోయిన్నాను. నా మాట నా మొగుడు మాటా అటుంచు, నాకైతే గుక్కెడు గెంజినీళ్ళు శాన. నా మొగుడైతే సారాతప్ప వొణ్ణం ముట్టడు. మరింక ఏటికి ఇద్దరు పిల్లలు. ఓ పిల్ల మొన్న ఎళ్ళేపోయింది. మిగతా ఇద్దరు ఆళ్ళకే బువ్వెట్టడం కనాకష్టంగుంది. మరినీకు నా నేటిచ్చినా నెత్తురుకూడిచ్చినట్టేలెక్క. మరి, కేసోదించడానికి ఏటిమ్మంటారో సెప్పు, నన్ను చూసి ఆలోసించిచెప్పు".

"ఓ వంద? వందివ్వగలవా?" అని నీరసంగా అడిగేడు మూర్తి.

"నేదు బాబూ! నన్నూ నా సంసారం అంతా అమ్మేసినా అంత ఖరీదు గిట్టదు. అంచేత వందాయివ్వను, యాభైయీ యివ్వను. ఉంటే అలాగే యిద్దును, ఉండాలా? నువ్వే సెప్పు. ఒందడగమని ఈ జామీను బాబు సెప్పుంటాడు. ఈ బాబుకేం? రెండొందలైనా 'ఇచ్చీ ఇచ్చీ' అంటాడు. నీకు నాను కాణీస్తే అందల సగం గుంజుతాడు. నా కన్నీ తెల్సు. ఈ సారా యాపారంలోకి దిగినతరవాత బాబూ! నా కెన్ని యిసయాలు తెలిసొచ్చినాయో సరీసెప్పలేను. పీడరుబాబూ సెప్పున్నాయిను! నువ్వేకాదు, ఈ బాబేకాదు, ఏ మనిసి మంచోడని ఒవురు జెప్పినా నాను నమ్మను, ఈ నోకం డబ్బూ యాపారం తప్ప మరేట్నేదు. పశువులు నోర్లేని సొమ్ములు – ఆటికి నీతుంది కాని మనకినేదు. సదువు లేన్దాన్ని నాకూనేదు; సదువుకున్నోడివి నీకూనేదు. డబ్బుకోసరం నోకం నోకవంతా పడుచుకొంటోంది. డబ్బుకి నాను సారా అమ్ముతున్నాను. డబ్బుకి, సదివినసదువంతా నువ్వమ్ముతున్నావు. డబ్బుకి పోలీసోళ్ళు నాయ్యెన్నమ్ముతున్నారు. మందుకోసరం పెద్దాసుపత్రి కెళ్తే అక్కడ మందులమ్ముతున్నారు, మంచా లమ్ముతున్నారు. లంజెలు రోడ్లంట, రిచ్చాలంట, కార్లంట తిరిగి ఒళ్ళమ్మకుంటున్నారు. గుళ్ళోకెళ్ళి, కొబ్బరికాయ సెక్కా కాన్డబ్బూ ఇస్తే, ఆ దేవుడిదయే అమ్ముతున్నారు. వోట్లొస్తే

అమ్మకం! అమ్మకం! అమ్మకం! అమ్మకం తప్పమరేట్నే దీలోకంలో. నాను సదువుకో నేదుగాని, చూసిన సత్తెం మాత్తరం అది. తప్పయితే తప్పని చూపించి సెప్పు! ఇంటాను."

"అవునవును" అన్నాడు మూర్తి.

"తప్పని నువ్వు సెప్పనేవు. అది నా కెరిక పీడరుబాబూ! నానన్నీ జూయిస్సినాను. మరింక బతికుండి సూడవలసిందేట్నేదు. పేనం మీద ఇసుగెత్తి పోయున్నాను. కన్నతండ్రేకాదు, కట్టుకున్న మొగుడేకాదు, కడుపున పుట్టిన పిల్లలేకాదు – ఒవురన్నా నాకు నమ్మికనేదు. ఆ కాడి కొచ్చినాక మరింక నాను బతికినాఒకటే, సచ్చినా ఒకటే! ఏటలా సూస్తున్నావు? ఏదాంతం సెప్తున్నాననా? ఏదాంతం కాదు, నాను సూసిందది. గాబరా పడిపోక!"

మూర్తి ఆమె మాటలకి కొంచెం గాభరా పడినమాట నిజమే,

"బాబూ నాలాటి బతుకు బతికేకంటే సవ్వడం నయం. ఈయేపారంలోకి దిగినాక మరీ నీచెం బతుక్కు జూయిస్సినాను. సిన్నప్పుడయితే కూలికి పోయేదాన్ని. అందల డబ్బుదొక్కదు. కాని యింత నీచెం నేదందల. డబ్బాశపడి ఇందులోకి దిగినాను. కాని ఏటిబావుకున్నాను? ఊరోళ్ళనీ పోలేసోళ్ళనీ పెంచడం అయిందితప్ప మరోట్నేదు. సేతల కాణిమిగల్నేదు. సారా అమ్మకానికి దిగి, తాగేవోళ్ళని సెడిపేను, నాను సెడ్డాను. అన్ని యిదాలా సెడ్డాను. బాబూ! ఇయాల పొంట సెయ్యాలంటే ఇంట్లో పొయ్యి తప్ప ఇంకేట్నేదు. అందలైనా బుగ్గితప్ప కర్రపేడైనా నేదు. వారం రోజులయి చుక్క సరుకైనా తేనేదు. అమ్మనేదు. ఇదుగో, ఇలా నాను సవ్వలేక బతుకుతుంటే, నెల మామూలు అనుకున్నటయాంకి అందలేదన్సెప్పి, మొన్న రేత్రి, యింటి మీదకి ఇరవై సుట్లెక్కిపోనాడు ఎడ్డుబాబు. దాన్తో నా నెర్రెత్తి పోనాను. ఆకరుసుట్టు మళ్ళీ ఆడొచ్చే సరికి సంద్రంల కెరటాల్లెగుస్తయ్ సూసేవా?–నా కడుపులకోపం కుతకుతలాడత అలా నెగసింది. మామూలుకోపం వొస్తేనే నా నాలిక నిలబడదు. అయాళ మరీ శివాలెత్తి పోయున్నాను. ఎత్తి పోయుండి ఆణ్ని రోడ్డు మీదెట్టి ఇడగడగీసినాను. రెండు గలాసులు కూడా యే సేసుకున్నానేమో–జెష్టబతుక్కదా బాబూనాది! దాంతో ఒళ్ళెరక్క రోకలుచ్చుకునేసరికి నెత్తి మీద ఎర్రబుట్టక్కడే ఒగ్గేసి టేసన్ కదే పారిపోన్డు ఎడ్డుబాబు. ఆయాళ పారిపోనాడు, నిన్న నీపని జేయిస్సినాడు. పీడరు బాబూ! నా మనసు అసలుకే యిరిగి పోయింది. కిందటోరం సరాసరిగ్గ ఇయాళ రోజున నా కూతుర్ని మట్టిజేయిస్సినాను. ఆరోయేడు జొరబడిందంతే, ఎందుకుపుట్టింది? ఎందుకు సచ్చింది? సెప్పేవోడెవడున్నాడు? ఏడ్చేస్తే ఇనేవోడెవడున్నాడు? ఏడ్చేసి నా నిలా కుమిలి పోయున్నాను. నువ్వు సూళ్ళేదుగాని, పీడరు బాబూ! మీ యిళ్ళల్ల పిల్లలకూడా అంత సెలాకి ఉండదు. మొన్న పీర్లపండక్కి సెప్తే నమ్మవు – ఆరేళ్ళ పిల్లా పులేసికం యేస్తే – ఆడపిల్లేటి? పులేసికం యెయ్యడం ఏటి? అన్సెప్పి వూరు

ఊరంతా తిరగబడిపోనారు. సంబరాలొస్తే బేజెక్కి చినీమాల్లో డేన్సు డేన్సంతా ఆడి సూపించేది. పెద్దయితే ఏ చినిమాలోకయినా ఏ బాబైనా తీసుకుపోడా అని ఆశెట్టు కున్నాను. కాని, బాబూ! నా సారాయాపారం నా కొంప తీసింది. పొద్దుబేళ లెగిసినకాణ్నుంచి రేత్రి పదకొండేసినదాకా సందు మొగినే కాసుకునుండేది. పిల్ల అల్లంతదూరం ఎలా కనిపెట్టేదో ఏటో పోలీసాళ్ళని సూసి సూడగానే 'అమ్మా కుక్కలొస్తున్నాయే, అమ్మా కుక్కలొస్తున్నాయే' అని కేకలేస్తా ఇంటికి పారొచ్చేది. కేకెయ్యగానే టూబులు, గీబులు, గలాసులు, గిలాసులు అన్నీ ఇంటెనక సెత్తలో దాయిస్సేదాన్ని. పిల్లంటే పిల్లకాదు, అంత సురుకైన పిల్ల. ఆయాళ్ళోజున - యింకా నెల తిరగనేదు - ఆ పొద్దుకూడా 'అమ్మా కుక్కే! అమ్మాకుక్కే!' అని కేకేస్తే రోజూలాగే అనుకొని సారా టూబులు దాసుకున్నాను గాని అటుసూసినానుగాను. పిల్ల బెంబేలెత్తిపోయి 'అమ్మా కుక్క కరిసేసిందే' అంటే తొలీత గాబరా అయిపోన్ను. ఆ యెనక 'సిన్న రక్కు రక్కిందే! మరేటి బయమనేదే' అన్నెప్పి దయిర్యం జేయిస్సినాను. ఎర్రికుక్క కరిసిందని కానుకున్నాను కాను. ఆకరికి ముత్తెంలాటి పిల్లని, కడుపునబుట్టిన బంగారుబొమ్మని, నా సేతల్తో నానే మట్టిల కలిపేసుకున్నాను. పీడరు బాబూ! సారా టూబులూ, గాజు గలాసులూ దాసుకున్నాను గాని కన్న కూతుర్ని దాసుకోనేకపోనాను. ఏం బతుకు బాబూ నాది? నా మొగుడు సారాపాలై పోనాడు. నా యాపారం పోలీసాళ్ళ పాలై పోనాది. నా కూతురు కుక్కలపాలై పోనాది. సీ! ఏటి యాపారం? ఏటీ బతుకూ? అని నా మనసు మనుసంతా ఇరిగిపోయింది. ఇలా ఇరిగిపోయి, కుమిలిపోయి నా నేడుస్తుంటే, మామూలియ్యలేదన్నెప్పి ఏడ్డుబాబు ఈ కేసు తగిలించినాడు. నిన్నబేళ నాకాడ గేలం కాదు, గలాసుకాదు, ఒక్క సుక్కయినా సారా నేదంటే నేదు. మిగిలినోళ్ళు ఇద్దరే పిల్లల్నాకు. ఆళ్ళమీద ఒట్టేసి సెప్తున్నాను. నా మాట నమ్మ నమ్మకపో. మొన్నబేళ ఏడ్డుబాబుని ఆయిదంగ అమరియాదా సేసేనన్నెప్పి కావేశం యెట్టుకోని నిన్నబేళ నాకీ మరియాదా జేయించినాడా బాబు."

"అంచేత పీడరు బాబూ! వొందకాదు, యాబయ్యీకాదు, ఓ పాతికిస్తాను. అదివ్వడానికైనా నన్నమ్ముకోవాల, నా మొగుణ్నమ్ముకోవాల, నేకపోతే నా పిల్లల్నమ్ము కోవాల, యేరే దార్నేదు. అయితే అమ్ముకునైనా సరే నీ డబ్బు నీకిస్తాను. నీ కష్టం నా మీదెందుకుండాల? ఇవ్వనేకపోతే యింట్లో అంట్లు తోమిస్తాను. అంట్లు తోమితే యెంతిస్తావు? నెల ముప్పయి రోజులికీ నాలుగిస్తావు, అయిదిస్తావు, అంతే కద?

ఈ కేసు ఓ వాయిదాలో తేలిపోతే నీకో గంటపని. ఒకోయిదా కాకపోతే రెండోయిదాలు. కాకపోతే మూడు. ఎన్ని వోయిదాలైనా వోదించేదో గంటేకద? కసేరీల నువ్వుపడ్డ గంట కష్టానికి నీ యింట్లో ఆర్నెల్లు అంట్లుతోమి మరీ నీ రుణం తీర్చుకుంటాను. వొకరి కష్టంమీదా వొకరు బతగ్గూడదు. ఆ యిసయం నాకు

తెల్దంటావా? తెల్సు. అంజేత బాబు నా మాటా నమ్ము. నా మీద కనికారంసూపించు. కేసోదించు; నీ కష్టం నీ కిచ్చి తీరుతాను. అందాకా, ఇయిగో ఈ పదీవుంచు."

ఆమె దగ్గర్నుంచి డబ్బు తీసుకొందికి మూర్తి కెందుకోగాని సిగ్గు వేసింది. కాని పుచ్చుకున్నాడు. ముత్యాలమ్మ లేచి నిల్చుంది. జామీను మనిషి కదలకుండా కూర్చుంటే అతణ్ని లేవమంది. "నీ కాఫీడబ్బులు నీకిస్తాను. ఆ బాబునేటడక్కు... నెగు నెగు" అని అతణ్ని బలవంతాన తీసుకుపోయింది.

ఆమె నెలాగైనా సరే కేసులోంచి తప్పించి తీరాలనుకున్నాడు మూర్తి. కేసు అబద్ధపు కేసని అతనికి గట్టి నమ్మకం కుదిరిపోయింది. హెడ్డుకూడా కొద్దిగా పరిచయం అయాక, "అవును బాబూ! అబద్ధం కేసే అనుకోండి. కాని, ఆవేళ నన్నెంతలేసిమాటలన్నదో తమరు విన్లేదు. కనీసం, పాగాకైనా మర్యాదా చూపించింది కాదు. అందుచేత మరి ఈ చురక తగిలించేను. ఏం చెయ్యమంటారు? మీరు వాదించండి. మీ డ్యూటీ మీది, మా డ్యూటీ మాది" అన్నాడు.

కేసు విచారణ జరిగిన రోజున మధ్యాహ్నం ఒంటిగంటకి కోర్టంతా కళకళగా వుంది. హెడ్డుగారూ, మరొక జవానూ సాక్ష్యం పలికేరు. తరువాత, కోర్టు హాల్లోంచి ముందు ముత్యాలమ్మా, తరువాత మూర్తి బైటకొచ్చారు.

వరండాలో మూర్తిని ఒక వారకిపిల్చి, 'ఏటవుతుంది బాబూ కేసు?' అని అడిగింది ముత్యాలమ్మ.

నెగ్గుతుందనే ధైర్యం ఉన్నప్పటికీ బైటకలా చెప్పే ధీమా లేకపోయింది మూర్తికి.

"సాయంత్రంలోపున తీర్పు చెప్పేస్తామన్నారు" అన్నాడు.

"జవాను బాబెలా పలికాడు."

"గట్టిగానే చెప్పేడు"

"ఎడ్డుబాబు?"

"పప్పులో కాలేసేడు. అన్నీ తప్పులే చెప్పేడు. అంచేత కేసు మనం నెగ్గొచ్చు" అన్నాడు మూర్తి.

నిజం చెప్పాలంటే సాక్షులిద్దర్నీ గట్టిగా క్రాస్ పరీక్ష చేసి ఇద్దరు సాక్షుల్లోనూ ముఖ్యుణ్ణి బాగా బోల్తాకొట్టించినందుకు చాలా ఉత్సాహంగా వున్నాడు మూర్తి.

"అయితే ఎడ్డుబాబు సొచ్చికం తేలిపోయినట్టేకదూ బాబు?"

"తేలగొట్టేసేం, మరేం ఫరవాలేదు."

"తేలగొట్టేస్తా డనుకున్నాన్లే"

"ఎలా అనుకున్నావు? ఎలా?"

"ఎలానంటావా? ఐతే ఇను. 'అయిపోన్దేదో అయిపోనాదిగాని మరేటంటావా ముత్యాలమ్మా' అనుకోని నిన్న వొచ్చినాడు బాబూ ఎడ్డుబాబు. మరలా ఆ బాబు అన్నప్పుడు నా నేటి చెయ్యను బాబు? తేలగొట్టేస్తానంటే కట్నం సదివించుకొన్నాను. కోర్టువోరి నిజెం యేరేనిజం బాబూ! ఇన్ని సుట్లొచ్చినాను కదా! నాకు బాగా ఎరికే! ఆళ్ళకి సాచ్చీకం సరిగుంటే శాన, జవానుబాబు నాగే ఎడ్డుబాబు కూడా బోనెక్కిగట్టిగ నిలబడిపోతే కేసేటవుద్ది, సిచ్చవుద్ది బాబూ! ఈ సాచ్చిదార్లు వొక రెనక వొకరూ బోనెక్కినా ముందిద్దరూ కూడబల్కినే యెక్కుతారు. ఆ యనక వొరాండాల గుమ్మం వోరన నిలబడి ఆడు సెప్పిందీడూ, ఇంటానే వుంటారు. కిటికీల కాడ నిలబడి బోనెక్కినోడికి సేతులూపుతానే ఉంటాడు. దూరంగా పొమ్మంటే ఆళ్ళ మనిసి మరోడు 'ఆల్లో' నిలబడి సాచ్చికం బాగా యిని, యెల్లి రెండో సాచ్చిదార్తో సెప్పొస్తాడు. అంచేత, బాబూ, కోర్ట్లొంట అన్నేయాలు నిలబడిపోతాయి. ఒకరి సాచ్చికం వొకరు యిన్నా యినక పోయినా సాచ్చిదార్లు పోలీసు బాబులేకదా? తెల్లార్లెగిస్తే ఇలాంటి కేసుల్లో యెయ్యికేసుల్లో సాచ్చికం సెప్తారు. ప్లీడరుబాబుచేత అడిగించినా-నువ్వయినా యేటడుగుతావు? 'వొప్పుడు టేసిన్ కాడ బయలెళ్ళినావు? ఎందరు బయలెళ్ళినారు? తెల్లి బట్ట లేసుకున్నారా! యూనేపారా లేసుకున్నారా? నడిసెళ్ళేరా? సైకిళ్ళమీదెళ్ళేరా? మనిసిని తొల్త మీరందర్ల ఒవురు జూసినారు? సారా కొల్సినావా? ఓసన జూసినావా? సారా కొట్లేయైనా సెకింగు సేసినావా?' ఇలాగ ఇయేకదబాబూ, నువ్వయినా అడగాలా! ఆళ్ళకియ్యన్నీ కొట్టినపిండి. అంతా యిన్నాక 'సాచ్చికం సరిగుంది తేడా లేట్నవు. ఉన్నా అయి శానా సిన్నయి తేడాలు. అంచేత జెరిమానా కట్టలేకపోతే జైలుకిపో' అంటాడు మేస్ట్రీటు బాబు. మూడుసుట్లు మూడబాద్దం కేసల్లి "రొండొందలు-రకతం రకతం-జెరిమానా సెల్లించినానుగదా! అంచేత బాబూ! ఏటి సాదన్జెప్పి నిన్న నా బాబుకి సదివించుకున్నాను. ఉచ్చుకున్న దుచ్చుకున్నాడుగాని ఆయెనక బోనెక్కి ఏంమాయ జేస్తాడో ఏదో అని బయపడతానే ఉన్నాను. తేలగొట్టేసినాడు గదా! మరైతే బయం నేదు" అని మూర్తికి ధైర్యం చెప్పింది ముత్యాలమ్మ. చెప్పి ఏమనుకొందో ఏమిటో "నువ్వు కూడా గట్టిగ బాగానే అడిగినావు బాబూ! కొత్తోడివని బయపడ్డానుగాని బాగానే అడిగినావు. నువ్వడుగుతుంటే, తొలిసాచ్చిదారు, జెవాను బాబు బెజ్జరిల్లి పోనాడు. ఎడ్డుబాబుకూడా నువ్వలా అడక్కపోతే తత్తర బిత్తరలాడ్డె! నా నిన్నాను, చూసినాను. దగ్గిరున్నానుగదా. గట్టిగ బాగనే అడిగినావు" అని మూర్తిని మెచ్చుకుంది.

మంచు విడిచిపోయినట్టుగా కేసంతా ఎందుకంత సులభంగా విడిపోయిందో అర్థమయేసరికి బుగడలోంచి గాలిపోయినట్టు, చప్పబడిపోయేడు మూర్తి. కేసు కొట్టేసిన తరువాత కురదా డబ్బు ఇవ్వబోయింది ముత్యాలమ్మ. మూర్తికి చాలా సిగ్గువేసి ససేమిరా పుచ్చుకోనన్నాడు. చేసేదేం లేక, వణుకుతున్న చేతుల్తో డబ్బు తిరిగి పట్టుకు వెళ్ళిపోయింది ముత్యాలమ్మ.

మూర్తికి అంతా అసందర్భంగానూ, కనుకట్టు కట్టి నట్టుగానూ, మాయగానూ తోచింది.

సారా, అసలుకి దొరకలేదు. దొరికిందని కేసు పెట్టేరు. దొరకలేదని తిరిగి తేలగొట్టేసేరు. విషయం జరగలేదు. జరగని విషయం జరిగిందన్నారు. జరిగినదని చెప్పబడిన జరగని విషయం జరగలేదన్నారు. లేదు. ఉంది. లేదు. అంతా మాయచేసేరు. కాని.... .

ముత్యాలమ్మ గురించి ఆలోచిస్తూ.

"కాని, ఈ మాయ మధ్య ఎంతటి బాధ!" అనుకున్నాడు మూర్తి.

అప్పుడతనికి పెద్ద ప్లీడరుగారు గుర్తుకొచ్చేరు. 'ఆయన మాయనే తెలుసుకున్నాడు. కాని బాధని తెలుసుకోలేదు' అనుకున్నాడు మూర్తి.

నిజంగా తెలుసుకోలేదా? లేక పట్టించుకోలేదా? ఈ 'మాయా ప్రపంచం'లో ముత్యాలమ్మ లాటి వారున్నారని ఆయనకి తెలియదా?

తెలీదూ?!

గుడ్‌గాడ్, ఎందుకు తెలీదు! తెలిసీ పట్టించుకో రంతే!

**విశాలాంధ్ర దినపత్రిక. 16–4–1961**